క్లుప్తంగా

రౌండ్ టేబుల్ సమావేశానికి ఆహ్వానం



పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపికకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

చిలమత్తూరు: విభజన హామీలు, సాగునీటి ప్రాజెకులపై ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఈనెల 13న హిందూపురంలో అఖిలపక్షం సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి హాజరు కావాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపికను గురువారం కమిటీ సభ్యులు ఆహ్వానించారు. రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరై విభజన హామీలపై మాట్లాడాలని కోరారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించారు.

రథోత్సవానికి రండి



వేణురెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని బెంగళూరు రోడ్డులో నిర్మించిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం రథోత్సవం నిర్వహించనున్నారు. రథోత్సవానికి రావాలంటూ ఇందిరానగర్ వార్డు ఇన్‌చార్జ్ మింటుతో కలిసి సుబ్రహ్మణ్య మాలధారులు వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డిని గురువారం ఆహ్వానించారు.

సామాజిక సేవా కార్యక్రమాలే లక్ష్యం



శిల్ప, షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్

పెనుకొండ: తనకు సామాజిక సేవా కార్యక్రమాలే ప్రధానమని, ఎటువంటి రాజకీయ కాంక్ష లేదని షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప అన్నారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాను ఓ రాజకీయ పార్టీలో చేరుతున్నట్లు ప్రచారం సాగుతోందని, అయితే అలాంటి ఆలోచన తనకు లేదన్నారు. షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టానని, విద్య, వైద్యం ఇతర ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టడమే లక్ష్యమన్నారు. అనవసరంగా లేనిపోని పుకార్లు పుట్టించి ఆవేదనకు గురిచేయరాదన్నారు. సేవా కార్యక్రమాలతో సంతృప్తి పొందుతున్నానన్నారు. భవిష్యత్తులో సేవే తన లక్ష్యమని, రాజకీయాల గురించి తన పేరును ఎక్కడా చర్చించుకోవద్దన్నారు.

మెప్మా ఆర్పీల సమస్యలు పరిష్కరించాలి



సీఎంఎం గంగులయ్యకు వినతిపత్రం అందజేస్తున్న మెప్మా ఆర్పీలు

హిందూపురం టౌన్: మెప్మా ఆర్పీల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో సీఎంఎం గంగులయ్యకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్పీలు, నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ఆర్పీలకు పని ఒత్తిడి పెరిగిందన్నారు. జీతం మాత్రం పెరగలేదన్నారు. ఆర్పీల ఖాతాల్లోకి నేరుగా జీతాలు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి మారుతిరెడ్డి, ఆర్పీల అసోసియేషన్ అధ్యక్షురాలు నాగలక్ష్మి, కార్యదర్శి ఆసియా బాను, కోశాధికారి ఐషా, ఉపాధ్యక్షురాలు సుమతి, రాధిక, సహాయ కార్యదర్శులు శారద, అలివేలమ్మ, రాధా, జ్యోతి, లక్ష్మి పాల్గొన్నారు.

సాగు చేసిన రైతులకే భూములివ్వండి



భూమి వద్ద ఆందోళన చేపడుతున్న రైతు సంఘం నాయకులు

పావగడ: ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న రైతులకే భూములు అందించాలని స్థానిక కర్ణాటక రాజ్య రైతు సంఘం తుమకూరు జిల్లా అధ్యక్షుడు పూజారప్ప రెవెన్యూ అధికారులను కోరారు. తాలూకాలోని వెంకటాపురం గ్రామంలో బాధిత రైతుల భూముల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 30 ఏళ్లుగా బీడుగా ఉన్న 17 ఎకరాల భూములను సాగు చేసుకుని పండించిన పంటల తో జీవనం సాగిస్తున్న సంబంధిత రైతులకు భూముల పట్టాలు అందివ్వక రెవెన్యూ అధికారులు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

అంతా మా ఇష్టం!

- అనుమతులు లేకుండా చెరువులో మట్టి తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు



పెద్దిపల్లి చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న దృశ్యం



చెరువులో నుంచి మట్టితో బయటకు వస్తున్న ట్రాక్టర్లు



ట్రాక్టర్ల తిరగడంతో ధ్వంసమైన రోడ్డు

రొద్దం: మట్టి మాఫీయా బరి తెగించింది. అధికార పార్టీ అండతో అక్రమార్కులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మట్టిని తరలిస్తున్నారు. ఇప్పటికే లక్షల రూపాయల విలువైన మట్టిని తవ్వేశారు. ఈ తతంగం అధికారులకు తెలిసే జరుగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని పెద్దిపల్లి చెరువు నుంచి వారం రోజులుగా మట్టిని తరలిస్తున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి తురకలాపట్నం–పెద్దిపల్లి గ్రామాల మధ్య కొనుగోలు చేసిన పొలంలో పెద్ద బావిని పూడ్చడానికి జేసీబీలు ఏర్పాటు చేసి ట్రాక్టర్లతో దాదాపు మూడు వేల ట్రిప్పులు చెరువు నుంచి మట్టిని తరలించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. మట్టి మాఫియా బరి తెగించి అధికార పార్టీ అండతో ఎలాంటి అనుమతులు లేకుండా జోరుగా మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. అధిక లోడుతో ట్రాక్టర్లు గ్రామంలో తిరగడంతో రోడ్లు ధ్వంసమయ్యాయని గ్రామీణులు వాపోయారు. నిబంధనల ప్రకారం రెవెన్యూ, ఇరుగేషన్ అధికారుల నుంచి అనుమతులు తీసుకుని, ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించి మట్టి తవ్వకాలు చేపట్టాలి. కానీ ఎలాంటి అనుమతీ తీసుకోకుండా ఇక్కడ మట్టి తవ్వకాలు చేపట్టారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. అధికారులు స్పందించి మట్టి మాఫియాకు అడ్డకట్ట వేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

అనుమతులు ఇవ్వలేదు

పెద్దిపల్లి చెరువులో మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు. అనుమతుల కోసం తమ వద్దకు వచ్చారని, అయితే ఇరిగేషన్ అధికారులతో అనుమతులు పొందాలని చెప్పాం. మట్టి తవ్వకాలను నిలిపివేయిస్తాం. మట్టి తరలిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం.

– ఉదయశంకరాజు, తహసీల్దార్

ఆర్టీసీ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

పెనుకొండ: పట్టణంలోని ఆర్టీసి డిపోలో గురువారం కార్మికులు గేట్ మీటింగ్ సందర్భంగా నిరసన చేపట్టారు. గత నెల మార్చిలో ఇచ్చిన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎన్ఎంయూఏ నాయకులు నాగరాజు, రామకృష్ణ, లతీఫ్ డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ ఉద్యోగుల ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 1–2019ను అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్‌ను ఆపాలని, గత నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. అలాగే గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు వెంటనే పరిష్కరించాలని మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో మేరకు సంరక్షణ సెలువులు మంజూరు చేయాలని, నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

మడకశిర: కార్మిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మడకశిర డిపో ఎదుట నాయకులు నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ఆందోళనలు చేపడుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. మహిళా కండక్టర్లకు మూడు రోజుల సెలవు, గ్యారేజీ ఉద్యోగులకు సరైన పనిముట్లు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ నాయకులు ముద్దప్ప, పురుషోత్తం, రామకృష్ణ, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

రొద్దం: బొక్సంపల్లి వద్దనున్న 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యసవర మరమ్మతుల కారణంగా శుక్రవారం కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలం పరిధిలోని రొద్దం, తురకలాపట్నం, రాగిమేకులపల్లి, పెద్దమంతూరు విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ కరెంట్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

మాంసం విక్రయాల నిషేధం

పావగడ: ఈనెల12న బుద్ధ జయంతి, 14న సోమవారం నిర్వహించే భారత రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయా రోజుల్లో తాలూకా వ్యాప్తంగా మాంసం విక్రయాలు నిషేధించారు. ఈమేరకు స్థానిక తాలూకా పంచాయతీ సమితి ఈఓ జానకి రామ్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే అన్ని గ్రామ పంచాయతీల పీడీఓలకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఆదేశాలను అతిక్రమిస్తే మాంసం విక్రయ దారులపై తగిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

భూ రీసర్వే వేగవంతం చేయండి

రొళ్ల: భూ రీసర్వే పనులను వేగవంతం చేయాలని తహసీల్దార్ షేక్షావలి సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండల తూభినకుంట రెవెన్యూ గ్రామంలో చేపట్టిన భూ రీసర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూబినకుంట రెవెన్యూ గ్రామంలో 365 మంది రైతులు పట్టదారు పాసుపుస్తకాలు పొందారని, మొత్తం 701 ఎకరాలు భూమి ఉండగా అందంలో 500 ఎకరాల వరకు భూ రీసర్వే పనులు చేపట్టామన్నారు. రీసర్వేతో రైతు తన భూ హద్దులు ఎంత వరకు ఉన్నాయని సులువుగా తెలుసుకోవడానికి వీలుంటుదని తెలిపారు. సర్వేయర్ కిరణ్‌కుమార్, పాల్గొన్నారు.

21న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

అగళి: ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో చేరడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈమేరకు పాఠశాల ప్రిన్సిపాల్ జాఫర్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో ఈ నెల 20 వ తేదీ పరీక్ష ఉన్నట్లు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని అయితే, 20 న ఈస్టర్ సందర్భంగా 21వ తేదీకి మార్పు చేసినట్లు తెలిపారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి



రహదారిపై గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పెనుకొండ రూరల్: కూటమి ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో గ్యాస్ సిలిండర్లతో రహదారిపై నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సిలిండర్‌పై ఒకేసారి 50 రూపాయలు పెంచడం దారుణమన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్, విద్యుత్ బిల్లులను ఉప సంహరించుకోక ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు హరి, బాబవలి, వెంకటరాముడు, రాజు రావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరల పెంపు దుర్మార్గం

చిలమత్తూరు: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరల పెంపుతో ప్రజలపై భారాన్ని మోపుతోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గ్యాస్, పెట్రో, డీజిల్ ధరలను తగ్గించాలని నిరసన చేపట్టారు. ఖాళీ సిలిండర్ నెత్తిన పెట్టుకొని, ఆటోకు తాడు కట్టి లాగుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్యాస్ ధరను ఒకేసారి రూ.50 పెంచడం దుర్మార్గమైన నిర్ణయమన్నారు. ప్రభుత్వం ధరల పెంపుపై పునరాలోచన చేసి ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు వెంకటేష్, రామచంద్ర, ఆటో కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

టీబీ వ్యాధి తీవ్రతపై సమగ్ర సర్వే



గోళాపురంలో సర్వే చేస్తున్న వైద్య బృందం

హిందూపురం: టీబీ వ్యాధి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ తిప్పయ్య తెలిపారు. మండలంలోని గోళాపురం గ్రామంలో గురువారం వైద్య బృందం సర్వే చేపట్టింది. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి టీబీ లక్షణాలు ఉన్న 15 మందిని గుర్తించి వారి నుంచి గళ్లను సేకరించడం జరిగిందన్నారు. టీబీ నిర్ధారణ అయితే మందులు పూర్తిగా ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా పౌష్టికాహారం తీసుకోవడానికి ప్రభుత్వం చికిత్స కాలంలో వ్యాధిగ్రస్తులకు వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలో ప్రతి నెల రూ.వెయ్యి జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ గౌస్‌పీర్, ఎంపీహెచ్ఈఓ వాసుదేవ, కిష్టప్ప, ఎంఎల్‌హెచ్‌పీ పావని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



గాయపడిన మహేష్, మధు

పెనుకొండ: పట్టణ సమపంలో పులేకమ్మ ఆలయం వద్ద 44వ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో శిడ్లఘట్టకు చెందిన ముగ్గురు కర్ణాటక వాసులు తీవ్ర గాయాల పాలయ్యారు. వారిని ప్రాథమిక చికిత్స నిమిత్తం ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బంది పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం శిడ్లఘట్టకు చెందిన పట్టు చీరల వ్యాపారులు మహేష్, మధు, శ్రీనివాసులు ధర్మవరానికి వ్యాపారం నిమిత్తం వెళ్లారు. పని ముగించుకుని కారులో తిరుగు ప్రయాణం చేస్తూ పులేకమ్మ గుడి వద్ద జాతీయ రహదారి పక్కన ఆగి వున్న ఆల్టో కారును ఢీకొనడంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స నిమిత్తం బాధితులను పెనుకొండ ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు. అనంతరం క్షతగాత్రులను బెంగళూరుకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు

హిందూపురం: ప్రజల దాహార్తి తీర్చడానికి పట్టణంలోని ప్రధాన కేంద్రాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ట్రాన్స్‌కో ఈడీ భూపతి అన్నారు. సద్గురు శ్రీ యోగి నారాయణ సేవా సమితి ప్రెసిడెంట్ రవిశంకర్ ఆధ్వర్యంలో గురువారం వీడీ రోడ్డులోని బిల్లింగ్ ఆఫీస్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏడీఈలు నాగన్న, జ్యోత్స్న యూనియన్ నాయకులు శ్రీనివాసులు, భగీరథ నవీన్ కుమార్, శబరి, విద్యుత్ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి కనుమ మారెమ్మ ఉత్సవాలు

మడకశిర: పట్టణంలో ఈనెల 14 నుంచి కనుమ మారెమ్మ ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు వాల్మీకి సంఘం నాయకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 14న జలధి, 15 జ్యోతుల ఉత్సవం ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా వారు నియోజకవర్గంలోని ప్రముఖులను ఉత్సవాలకు ఆహ్వానించారు. ఇదిలా ఉండగా ఉత్సవాల సందర్భంగా పట్టణంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు టౌన్ సీఐ నాగేష్ తెలిపారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం

మడకశిరరూరల్: జమ్మానిపల్లిలో వెలిసిన లక్ష్మీ నిడిమామిడమ్మ ఆలయ 38 వార్షికోత్సవం శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొలిరోజు గణపతి పూజ, కలశ స్థాపన, లక్ష్మీనారాయణ హోమం, పూర్ణహుతి, శనివారం కలశ అర్చన, చండీ హోమం, కలశ ఉద్వాసన మహా కుంభాభిషేకం తదితర పూజలు నిర్వహిస్తామన్నారు.

సంక్షిప్త సమాచారం

రైతులకు స్ప్రింక్లర్ల పంపిణీ



స్ప్రింక్లర్లు అందిస్తున్న ఏఓ మంజునాథ

అమరాపురం: స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో గురువారం ఏఓ మంజునాథ రైతులకు స్ప్రింక్లర్లు పంపిణీ చేశారు. రైతులు తమ పొలాల్లో నీటిని ఆదా చేయడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వీఏఏలు రైతులు, పాల్గొన్నారు.

13న అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం

హిందూపురం: సాగునీటి ప్రాజెక్టులు, విభజన హామీలు, రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై చర్చించి భవిష్యత్తులో ప్రభుత్వాలపై ఉద్యమించడానికి ఈనెల 13వ తేదీన అంబేడ్కర్ భవన్‌లో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. సమావేశాన్ని జయప్రదం చేయాలని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి శంకరయ్య కోరారు. గురువారం పట్టణంలో ఆహ్వాన పత్రికలు అందజేశారు. అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశానికి రాష్ట్ర నాయకులు బి.నారాయణ, కేవీ రమణ, నూర్ మహమ్మద్, జిల్లా అధ్యక్షుడు గంటల నారాయణరెడ్డి హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు హనుమంత రాయప్ప, ఎల్లప్ప, కేఎస్ హనుమంతప్ప, మునిరాజు, రుద్రప్ప, నంజుండప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహావీర్ జయంతి



అలంకరణలో మహావీర్ చిత్రపటం

పావగడ: భగవాన్ మహావీర్ జయంతి వేడుకలు స్థానిక తాలూకా కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప తహసీల్దార్ చంద్రశేఖర్ మహావీర్ చిత్ర పటానికి పూజలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక జైన్ మతస్థులు అజీత్ రాజు, సుందర్ రాజు, అరిహంత్ జైన్, వృషభ రాజ్ జైన్ పాల్గొన్నారు.

అకాడమీ సభ్యుడికి సన్మానం

పావగడ: తాలూకాలోని దవడబెట్ట గ్రామానికి చెందిన ప్రముఖ సాహితీ వేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు డా డికే చిత్తయ్య పూజార్ ను స్థానిక కన్నడ సాహిత్య పరిషత్ పదాధికారులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో కన్నడ భాషాభివృద్ధికి అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించాలని అకాడమీ సభ్యుడు చిత్తయ్య పూజార్‌ను కోరారు. ఈ సందర్భంగా కసాప ట్రెజరర్ కేఎం ప్రభాకర్ ఉన్నారు.

50 శాతం వడ్డీ రాయితీ

పెనుకొండ: ఏక మొత్తంలో చెల్లించే ఆస్తి పన్ను వడ్డీపై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు నగర పంచాయితీ కమిషనర్ సతీష్‌కుమార్ గురువారం తెలిపారు. ఆస్తి, ఖాళీ స్థల పన్ను బకాయిలు ఈ నెల 30లోపు ఏక కాలంలో చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పన్ను బకాయిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పెద్దిరెడ్డిపల్లిలో నేడు 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్'

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ పెద్దిరెడ్డిపల్లిలో శుక్రవారం కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్ కార్యక్రమాన్ని నిర్వహించనునట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ పాల్గొంటారన్నారు. ఉదయం 6 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

జీఓలను రద్దు చేయండి

పెనుకొండ: రైతులకు నష్టం కలిగించే 404, 405 జీఓలను ప్రభుత్వం వెంటనే రద్దు చేసి, హంద్రీనీవా లైనింగ్ పనులు నిలుపుదల చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు హెచ్ఎన్ఎస్ఎస్ అధికారి ఉస్మాన్‌ఖాన్‌కు గురువారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ లైనింగ్ పనుల వల్ల రైతులకు నష్టం కలుగుతుందన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 404, 405 జీవోలు అమలయితే ఉమ్మడి అనంతపురం జిల్లా ఎడారిగా మారి రైతులు వలసలు పోక తప్పదన్నారు. లైనింగ్ పనుల చేపడితే భవిష్యత్తులో హంద్రీనీవా కాలువ వెడల్పు చేయడం అసాధ్యమన్నారు. మడకశిర బ్రాంచి కెనాల్ పనులు వెంటనే పూర్తి చేయాలని, పిల్ల కాలువల ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో అన్ని చెరువులకు నీరివ్వాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, సీఐటీయూ మండల కన్వీనర్ బాబావలి, మహబూబ్ బాషా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



నాటిక రూపంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రొద్దం: ప్రతి మహిళా చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకోవడం చాలా అవసరమని అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో అనంతశక్తి సొసైటీ న్యాయసలహాల మండలి ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. దిశ, గృహింస, వేధింపులు, బాల్య వివాహాలు, చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా మహిళా సాధికారతకు దోహదపడుతుందన్నారు. మహిళలపై వివక్షత తదితర చట్టాలపై నాటిక రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు సుశీలమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన నరసింహమూర్తి

అమరాపురం: కనకనపల్లి సమీపంలో పాఠశాల బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..బసవనపల్లి గ్రామానికి చెందిన నరసింహమూర్తి బైక్‌పై వస్తుండగా సాయి విద్యానికేతన్ పాఠశాల బస్సు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108 వాహనంలో మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు తుమకూరు ఆసుపత్రికి తరలించినట్లు బాధితుడి బంధువులు తెలిపారు.

మహిళకు అస్వస్థత

చిలమత్తూరు: మండల పరిధిలోని కొత్తచామలపల్లికి చెందిన మంజుళ అనే మహిళ గురువారం చీమలు మందు కలిసిన అన్నం తిని తీవ్ర అస్వస్థతకు గురైంది. బంధువులు ఆమెను హుటాహుటిన 108 వాహనంలో బాగేపల్లి ఆసుపత్రికి తరలించారు. బియ్యానికి చీమలు పడుతుండటంతో సంచి చుట్టూ చీమలు మందు వేసింది. పొరపాటుగా చీమలు మందు బియ్యంలో కలవడం, ఆపై వంట చేయడంతో ఆ అన్నం తిని అస్వస్థతకు గురైనట్లు స్థానికులు తెలిపారు. కాగా సదరు మహిళ ఆరోగ్యం నిలకడగా ఉందని ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చిలమత్తూరు: మండల కేంద్రానికి చెందిన ఉప్పర శ్రీనివాసులు అనే వ్యక్తి గురువారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్థాపానికి గురై ఆత్మహత్యకు యత్నించినట్లుగా స్థానికులు చెబుతున్నారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.